క్రైస్తవులపై దౌర్జన్యాలు అరికట్టాలి

● డీజీపీ శివధర్‌రెడ్డికి వినతి


డీజీపీ శివధర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గోనె సాల్మన్‌రాజ్ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపై దౌర్జన్యాలు, మతపరమైన నిర్మాణాలను ధ్వంసం చేయడాన్ని అరికట్టాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్(టీయూసీపీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ డీజీపీ శివధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. యూట్యూబ్ చానల్లు, మీడియా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంల ద్వారా మతపరమైన విభేదాలు అప్పుడప్పుడు మతపరమైన ఉద్రిక్తతలను రేకెత్తించే, శాంతికి ముప్పు కలిగించే, వివిధ వర్గాల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసే చర్చలను ప్రసారం చేస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన డీజీపీ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ప్రార్థనా స్థలాల్లో ట్రాఫిక్ పార్కింగ్ చలాన్లు విధించడం ఆపాలని కోరారు. భక్తులకు ఆర్థికభారం లేకుండా ప్రార్థనలు చేసుకునే వాతావరణాన్ని కల్పించాలని అయన డీజీపీని కోరారు. ఈ ఏడాది డిసెంబర్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్లో గృహసందర్శన కరోల్స్ వీధి కరోల్స్, కార్నివాల్స్ క్రిస్మస్ సీజన్ కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతులు ఇవ్వడంతో పాటు రక్షణ చర్యలు తీసుకోవాలని సాల్మన్‌రాజ్ డీజీపీని కోరారు. టీయూసీపీఏ కార్యనిర్వాహక సభ్యులు పి.జయప్రకాష్, కె. డేనియల్, టి. సాల్మన్‌రాజ్, కె. అహీనోమ్ తదితరులు పాల్గొన్నారు.

5న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సమావేశం

చిక్కడపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నవంబరు 5న ఉదయం 10గంటలకు త్యాగరాయగానసభలో జరుగుతుందని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. శ్రీనివాస్ తెలిపారు. సొసైటీకి సంబంధించిన పలు విషయాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాల సాధన కోసం 2008లో ఏర్పడిన ఈ సొసైటీలో దాదాపు 1400మంది జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని, చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం 17ఏళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. ఇండ్లస్థలాలు పొందకుండానే చాలా మంది జర్నలిస్టులు మృతిచెందారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సొసైటీకి స్థలం ఇవ్వాలని కోరుతూ సీఎంకు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అడ్డంపెట్టుకుని జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తుందని వారు ధ్వజమెత్తారు. నవంబరు 5న జరిగే సొసైటీ జనరల్ బాడీ మీటింగ్‌లో భవిష్యత్తు కార్యాచరణపై కీలకమైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. అత్యంత కీలకమైన ఈ సమావేశానికి సొసైటీ సభ్యులందరూ తప్పనిసరిగా ఉదయం 10గంటలకు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేకశాఖగా కొనసాగించాలనే జీవోను అమలు చేయాలి

చిక్కడపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేకశాఖగా కొనసాగించాలనే జీవో 34ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్డీ) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు వరమ్మ, అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య తెలిపారు. ప్రభుత్వం జీవో ఇచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కూడా అమలు కావడం లేదన్నారు. జీవోను తక్షణం అమలు చేయాలని నిర్వహిస్తున్న ధర్నాలను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



కళాపురస్కార్ అవార్డులను బహూకరిస్తున్న అతిథులు, నిర్వాహకులు


కళాపురస్కార్ అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, భారత యువ సేవాసంఘ్(బీవైఎస్ఎస్)సింధుభైరవి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చిన్నారి శాస్త్రీయ నృత్య కళాకారులకు కళాపురస్కార్ అవార్డుల ప్రదానసభ కార్యక్రమం ఘనంగా జరిగింది. త్యాగరాయగానసభలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రాచీన కళాకేంద్రం చండీఘడ్ యూనివర్సిటీ నుంచి నృత్యపోటీల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వారి ప్రతిభను గుర్తించి ఈ అవార్డులు ప్రదానం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ టీవీ నటుడు అనిల్ అల్లం మాట్లాడుతూ ఎంతో కృషి చేస్తేనే కళాప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రముఖులు భరద్వాజ్, బాలకృష్ణన్, ప్రశాంత్‌జీ, రాజశేఖర్, నూక రాజు, గోవింద్, నారాయణ, షేక్ షావలి, రాజీవ్‌గాంధీ, వరలక్ష్మి, కేవీఎస్ దుర్గాప్రసాదరావు, జీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద యువతికి పుస్తెమెట్టెలు అందజేత

బర్కత్‌పుర, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : త్వరలో వివాహం జరగనున్న ఆకుల భవానీకి రెండు గ్రాముల బంగారు పుస్తె, ఒక తులం వెండి మెట్టెలు పట్టుచీరను తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ పుస్తెమెట్టెల కన్వీనర్ దండు నరేందర్ అందజేశారు. కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివాహం జరగనున్న భవాని సోదరుడు ఆకుల ప్రసాద్, దేశెట్టి రాజులకు వీటిని అందజేశారు. దీనితో పాటు కల్యాణం కోసం మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు రూ.5వేల సహాయం అందించారు. అతనితో పాటు మరికొంత మంది నగదును, రెండు పట్టు చీరలను అందించి ధాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్, సతీష్, అజయ్‌కుమార్, జ్యోతి పాల్గొన్నారు.

మూడు ముడులు ముప్పై మూడు పుస్తకావిష్కరణ


సీనియర్ జర్నలిస్ట్ సతీష్‌చందర్ రచించిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రచయిత్రి ఓల్గా

రాంనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : సీనియర్ జర్నలిస్ట్ సతీష్‌చందర్ రచించిన మూడు ముడులు ముప్పై మూడు వ్యంగ రచన పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆవిష్కరించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన సుప్రసిద్ధ రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ స్త్రీలకు సంబంధించిన హక్కులు చట్టాల గురించి వ్యంగంగా హాస్యంగా ఎంతో గొప్పగా రచించారన్నారు. ఆయన రాసిన పేర్లలో కూడా ఒక ప్రత్యేకతను చాటుకుందన్నారు. సతీష్‌చందర్ రాసిన మృష్నాల పేటతో పాటు ఈ పుసక్తం బీభత్సాన్ని సృష్టిస్తుందన్నారు. రాజకీయం, అధికారం అనే మత్తు ఎక్కితే మనుషులు ఏమైపోతారనే విషయాన్ని వ్యంగ్యంగా రచించారన్నారు. రచయిత్రి సి.మృణాలిని మాట్లాడుతూ సతీష్‌చందర్ ఇలాంటి వ్యంగ్య రచనలు అనేకం తీసుకొచ్చారని దీనికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత సన్నిదానం నర్సింహశర్మ, జర్నలిజం అధ్యాపకులు ఎం.శ్రవణ్, సతీష్‌చందర్ పాల్గొన్నారు.


మహాత్మానగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు నిలిచిపోవడం వల్ల ఇబ్బంది పడ్డ విద్యార్థులు


వర్షానికి వీఎస్టీ యూనియన్ కార్యాలయం ఎదుట గుంతలమయంగా మారిన రోడ్డు

ముషీరాబాద్, అంబర్‌పేటలో జోరువాన

రాంనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేని వర్షం పడుతుంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షం ఉన్నప్పటికీ ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలు యథావిధంగా కొనసాగాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షం వల్ల పలు చోట్ల ప్రధాన రహదారులు, అంతర్గతరోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. పలు చోట్ల చెట్లు కూలిపోగా కొమ్మలు విరిగిపడ్డాయి. అలాగే పలు చోట్ల విద్యుత్ స్తంభాలు వంగిపోయి కేబుల్ వైర్లు కిందపడ్డాయి. రాంనగర్ నుంచి వీఎస్టీకి వెళ్లే మెయిన్ రోడ్డులో బీఈ చౌరస్తా వద్ద ఓ చెట్టు కూలిపోయింది. దీంతో వైర్లు తెగిపడ్డాయి. స్థానికుల ఫిర్యాదుతో జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్ అక్కడికి చేరుకుని కూలిపోయిన చెట్ల కొమ్మలను తరలించారు. బీఈ చౌరస్తా నుంచి ఉదయం ప్రెస్ మీదుగా నాగమయ్యకుంట హట్స్ వరకు జీహెచ్ఎంసీ నూతనంగా నిర్మిస్తున్న వరదనీటి పైప్‌లైన్ నత్తనడకన సాగడం వల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గం నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నిలువకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు ఎప్పకటికప్పుడు సిబ్బందితో పర్యవేక్షణ చేపట్టారు. వర్షం సమస్యలను ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి, అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్‌లు తమ సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ల పరిస్థితిని టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి అందులోని ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నిండుకుండలా హుస్సేన్‌సాగర్..

మొంథా తుఫాను వల్ల నగరంలో పడుతున్న భారీ వర్షం వల్ల హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. 513అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. దీంతో మిగులు వరదనీరు కవాడిగూడ వైస్రాయ్ వద్ద గల తూము నుంచి కిందకు ప్రవహిస్తుంది. దీంతో హుస్సేన్ సాగర్ పరీవాహక ప్రాంతాల్లో వరదనీరు ఎక్కువగా ప్రవహిస్తుంది. కవాడిగూడ, గాంధీనగర్, అశోక్‌నగర్, హిమాయత్‌నగర్, బాపునగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, రత్నానగర్ ప్రాంతాల్లో నాలా ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరికలు చేశారు.

ముషీరాబాద్ : తుఫాన్ వల్ల ముషీరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం వేళల్లో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారులు, పాదచారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో భారీగా వర్షం నీరు నిలిచిపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందిపడ్డారు.


వర్షానికి బీఈ చౌరస్తా సమీపంలో కూలిన చెట్లు, తెగిన వైర్లు

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం

● మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్


కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారం చేసేందుకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనార్టీలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడంతో ప్రజలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఈ ఉప ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోరని అన్నారు. షేక్‌పేటలో త్వరలో జరిగే కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ కొప్పుల ఈశ్వర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, సోషల్‌మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్, సాయి పాల్గొన్నారు.


సామాజిక సేవారంగంలో విశేష సేవందిస్తున్న సిటీ సివిల్‌కోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్ పీపీపీ అంజనికుమారికి సాహితీ రత్న చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, సుప్రసిద్ధ గాయకుడు గోరటి వెంకన్న చేతుల మీదుగా త్యాగరాయగానసభలో ప్రతిభా సేవా పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు చిక్కా రవికిరణ్, గౌరవాధ్యక్షుడు దేవదాస్, నరేందర్ పాల్గొన్నారు. - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

ఫార్మసీ ఆఫీసర్స్ రిజల్ట్స్ ప్రకటించాలి

నల్లకుంట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ ఆఫీసర్స్ రిజల్ట్స్ వెంటనే ప్రకటించాలని తెలంగాణ స్టేట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం సెక్రటేరియట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం హైదర్‌గూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మెడికల్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న ఫార్మసీ ఆఫీసర్ల నియామకాల ఫలితాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎంతో కాలంగా అభ్యర్థులు ఈ ఫలితాల కోసం వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నారని ప్రభుత్వం ఈ విషయంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. 732 మంది ఫార్మసీ ఆఫీసర్లు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిని కోరడం జరిగిందన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, కందకట్ల శరత్‌బాబు, స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, కోశాధికారి యాదయ్య, నాయకులు ప్రకాష్‌రావు, ఏ.వి. శ్రీహరి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ప్రజలు బీజేపీని గెలిపించాలి

● రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


దీపక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ రవిచారి తదితరులు

రాంనగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : నిస్వార్థంగా ప్రజాసేవ చేసే బీజేపీని జూబ్లీహిల్స్ ప్రజలు గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా బుధవారం రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి లక్ష్మణ్ వెంగళరావునగర్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి గెలిస్తే ఆయన ప్రజలకు అందుబాటులో ఉండి నిరంతరం ప్రజాసేవ చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ అధికార బలంతో బీఆర్ఎస్ డబ్బు బలాన్ని చూపిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీకి ప్రజాదరణ ఉందని, దాంతోనే తాము గెలుస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ పర్యటించి డ్రైనేజీల దుస్థితిని, మ్యాన్‌హోల్స్ దుస్థితిని పరిశీలించారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు. మ్యాన్‌హోల్స్ తెరిచి ఉంటే వాటిని మూసివేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. - గోల్నాక, ఆంధ్రజ్యోతి

నాలా విస్తరణ బాధితులకు చెక్కుల పంపిణీ


నాలా విస్తరణ బాధితులకు చెక్కును అందజేస్తున్న డీఎంసీ మారుతి దివాకర్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట సర్కిల్ పరిధిలో హుస్సేన్‌సాగర్ నాలా విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ఆర్థిక సహకారం అందజేస్తున్నట్లు అంబర్‌పేట డీఎంసీ మారుతి దివాకర్ తెలిపారు. రత్నానగర్‌కు చెందిన డి.అనిల్‌కుమార్ ఇళ్లు కోల్పోతున్న నేపథ్యంలో అతనికి నష్టపరిహారం రూ.2.87 లక్షల చెక్కులను బుధవారం సర్కిల్ కార్యాలయంలో డీఎంసీ మారుతిదివాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా విస్తరణలో భాగంగా 87ఇళ్లు పోతున్నాయని ఇప్పటి వరకు 50 మందికి ఆర్థిక సహకారం చెక్కులను అందజేశామన్నారు. మిగత వారికి కూడా సహకారం కల్పించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు సత్యవర్ధన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అంబర్‌పేట డివిజన్‌లోని అహ్మద్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ప్రధానంగా ఉన్న లోప్రెషర్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని ఆయన బస్తీవాసులకు హామీ ఇచ్చారు. - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి


జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయాన్ని ఆకాంక్షిస్తూ యూసుఫ్‌గూడ డివిజన్‌లో గోల్నాక డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు ఎ.సురేష్‌గౌడ్, నర్సింగ్ యాదవ్, ప్రభాకర్ ముదిరాజ్, పడకంటి అంజయ్యచారి తదితరులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. - గోల్నాక, ఆంధ్రజ్యోతి

వ్యాసరచన పోటీల్లో చైతన్యకు రూ.లక్ష బహుమతి

బర్కత్‌పుర, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బీపీపీ యూనివర్సిటీ లండన్ విద్యార్థులలో రచన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నిజాం కళాశాలకు చెందిన బీ బీ ఏ తృతీయ సంవత్సరం చదువుతున్న ఏ.చైతన్య లక్ష రూపాయల మొదటి బహుమతిని గెలుచుకొని తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. బీపీపీ యూనివర్సిటీ నిజాం కళాశాలలో ఈ వ్యాసరచన పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో 150 మంది డిగ్రీ విద్యార్థులు పాల్గొనగా చైతన్య మొదటి స్థానంలో నిలిచింది. లక్ష రూపాయల చెక్కును అందుకుంది మరో 11మంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా నిజాం కళాశాలలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవి రాజశేఖర్ ఈ చెక్కును ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ బీపీపీ యూనివర్సిటీ తమ కళాశాలను ఎంపిక చేసుకొని పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



వ్యాసరచన పోటీలో లక్ష రూపాయల బహుమతి సాధించిన నిజాం కళాశాల విద్యార్థిని చైతన్య

బీసీ రిజర్వేషన్ల ప్రైవేటు బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి

● బీసీ జేఏసీ కోచైర్మన్ దాసు సురేష్

బర్కత్‌పుర, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో కల్పించిన 42శాతం బీసీ రిజర్వేషన్ల ప్రైవేటు బిల్లును ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ పార్లమెంటులో ప్రవేశపెట్టాలని బీసీ జేఏసీ కోచైర్మన్ దాసు సురేష్, చీఫ్ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, కోఆర్డినేటర్ కులకచర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లును ఆమోదించాలని వారు విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నవంబరు 2న జరుగనున్న బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశం వాల్‌పోస్టర్‌ను పలు బీసీ సంఘాల నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్లను సాధించుకోవడమే లక్ష్యంగా బీసీ జేఏసీ ముందుకు సాగుతుందని, అవసరమైతే జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడుతుందని వారు తెలిపారు. 42శాతం రిజర్వేషన్లతో పాటు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లను సాధించడానికి జాతీయ స్థాయిలో ఒక కార్యాచరణను రూపొందిస్తున్నామని వారు తెలిపారు. నవంబరు 2న నగరంలోని కలింగ భవన్‌లో బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, అన్ని పార్టీలు బీసీ కులసంఘాలు, న్యాయనిపుణులు, ప్రొఫెసర్లు, మేధావులు, ఉన్నత విద్యావంతులు, అన్ని సంఘాల నేతలు ఈ సమావేశంలో పాల్గొంటారని వారు తెలిపారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి బీసీ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామని, ఈ కమిటీల్లో అందరికీ అవకాశం కల్పిస్తామని వారు తెలిపారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో బీసీ జేఏసీ చైర్మన్ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించేంత వరకు విశ్రమించేదిలేదని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు కోల జనార్దన్, నందగోపాల్, సరస్వతి, బండారు పద్మావతి, జ్యోతి, మిరియాల శ్రీలత, నాగుల కనకయ్యగౌడ్, చిన్నరాములు, ప్రొఫెసర్ పురుషోత్తం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ కోచైర్మన్ దాసు సురేష్, చీఫ్ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ తదితరులు